విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

సీతంపేట రూరల్, జూలై16(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హెచ్‌ఎం, వార్డెన్, పీడీలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు వచ్చే జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మలేరియాతో బాధపడుతున్న వారి వివరాలు ఐటీడీఏ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్లు పనిచేసేలా చూడాలని, విద్యార్థులకు వేడినీరు అందించాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

బెల్టు తీసేదెప్పుడు?

- జిల్లాలో ఎక్కడికక్కడే బెల్టు షాపులు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా విక్రయాలు
- సిండికేట్లుగా మారుతున్న కొందరు మద్యం వ్యాపారులు
- సీఎం చంద్రబాబునాయుడు హెచ్చరిక బేఖాతర్
- కొన్ని గ్రామాల్లో షాపుల నిర్వహణకు వేలం పాటలు
- భామిని టు బత్తిలి, గంగాడ టు వంగరకు సరఫరా
- ఇష్టారాజ్యంగా దందా సాగిస్తున్న వైనం
- తూతూమంత్రంగానే దాడులు

పార్వతీపురం, జూలై16(ఆంధ్రజ్యోతి): 'మద్యం దుకాణాల ద్వారానే మద్యం విక్రయాలు జరగాలి, ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే బెల్ట్ తీస్తాం.' అని అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో మాత్రం ఇందుకు భిన్న పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడే బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. కొందరు మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తమ దందా కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి హెచ్చరికను సైతం పట్టించుకోవడం లేదు. పల్లె, పట్టణ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తూ.. అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. కాగా పట్టణాల్లో పోలిస్తే గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారానే మద్యం విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అందుకే కొన్నిచోట్ల పోటాపోటీగా ఆ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం వేలం పాటలు కూడా నిర్వహిస్తున్నారు. బలిజిపేట మండలం చిలకలపల్లిలో రూ.3 లక్షలకు ఒకరు బెల్ట్ దుకాణాన్ని దక్కించుకున్నారు. అదే మండలంలో శివరాంపురం, పనుకువలస, సుభద్ర, పెద్దింపేట తదితర గ్రామాల్లోనూ బెల్ట్ షాపుల నిర్వహణకు బహిరంగంగానే వేలం పాట నిర్వహించారని తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

నియోజకవర్గ కేంద్రాలతో పాటు ప్రధాన గ్రామాల్లో ఎక్కడికక్కడే బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయి. సిండికేట్‌లు ఒక్కో బాటిల్‌పై రూ.ఐదు నుంచి రూ.పది అదనంగా ఇచ్చి మద్యం కొనుగోలు చేసుకుంటున్నారు. అయితే గ్రామాల్లో డిమాండ్‌ను బట్టి వారు ఒక బాటిల్‌పై అదనంగా రూ.20 నుంచి రూ.30 పెంచి అమ్మకాలు చేపడుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గంగాడ టు వంగర ..

బెల్టు దుకాణాలకు మద్యం షాపుల నుంచే మద్యం సరఫరా జరుగుతున్న పరిస్థితి నెలకొంది. ఈ మేరకు బలిజిపేట మండలం గంగాడ నుంచి విజయనగరం జిల్లా వంగర మండలానికి మద్యం తరలిస్తున్నారు. వంగర మండలంలో పలు గ్రామాలు గంగాడకు దగ్గరగా ఉన్నాయి. దీంతో కొందరు గంగాడ నుంచి మద్యం కొనుగోలు చేసి ఆయా గ్రామాల్లోని బెల్ట్‌షాపుల ద్వారా విక్రయాలు చేపడుతున్నారు.

భామిని నుంచి బత్తిలి

భామిని మండలం బత్తిలి గ్రామంలో మద్యం దుకాణం లేదు. ఇక్కడున్న గీత కార్మికులకు దుకాణాన్ని కేటాయించాల్సి ఉంది. అయితే

(మిగతా 8వ పేజీలో...)

జీవో నెంబర్-3పై

నేడు అభిప్రాయ సేకరణ

- పార్వతీపురం ఐటీడీఏలో సమావేశం
- హాజరుకానున్న గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవి

పార్వతీపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏలో గురువారం జీవో నెంబర్-3 అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు గిరిజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు, న్యాయవాదులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరించనున్నారు. ఈ సమావేశానికి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి హాజరు కానున్నారు. అభిప్రాయ సేకరణ అనంతరం నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేయనున్నారు. దీని ఆధారంగా జీవో నెంబర్-3ను పునరుద్ధిస్తారా లేక దాని స్థానంలో ప్రత్యామ్నాయ జీవోను తీసుకొస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది. వాస్తవంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వమే జీవో నెంబరు 3ని అమలు చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో న్యాయస్థానం తీసుకున్న నిర్ణయంతో అది రద్దయింది. దీనిపై నాటి సర్కారు స్పందించకపోగా.. న్యాయ పోరాటం కూడా చేయలేదు. దీంతో గిరిజన యువత ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న సీఎం చంద్రబాబునాయుడు జీవో నెంబరు 3 పునరుద్ధరణకు అడుగులు వేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చర్యలు చేపడుతున్నారు. కాగా అభిప్రాయ సేకరణకు పార్వతీపురం ఐటీడీఏలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం తెలిపారు. 17న ఉదయం 10:30 గంటలకు గిరిమిత్ర సమావేశ మందిరంలో అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. అందరూ తప్పక హాజరుకావాలని కోరారు.



ఎరువుల దుకాణాలపై

విజిలెన్స్

8లో

- జిల్లాలో విస్తృతంగా తనిఖీలు
- అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరిక

శివారు భూములకూ నీరందిస్తాం

- రైతులకు అసౌకర్యం కలగకుండా చర్యలు
- ఎస్ఈ అప్పారావు
- తోటపల్లి పాత రెగ్యులేటర్ నుంచి సాగునీరు విడుదల

గరుగుబిల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని శివారు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామని జల వనరులశాఖ ఎస్ఈ ఆర్.అప్పారావు తెలిపారు. బుధవారం పాత రెగ్యులేటర్ నుంచి ఖరీఫ్‌కు సాగునీరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..' పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరాకు ముందుగానే కాలువల పరిధిలోని పూడికలు తొలగించాం. ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. త్వరలోనే గరుగుబిల్లి, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ, బలిజిపేట, విజయనగరం జిల్లాలో వంగర, సంతకవిటి, శ్రీకాకుళం జిల్లాలో బూర్జ మండలంలో సుమారు 63,459 ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తాం. ప్రస్తుతం రెగ్యులేటర్ పరిధిలో 40 వేల ఎకరాలకు సాగునీరందేలా చర్యలు చేపట్టాం. ఎడమ ప్రధాన కాలువ నుంచి 250 క్యూసెక్కులు, కుడి పిల్ల కాలువ నుంచి 70 క్యూసెక్కులు విడుదల చేశాం. లస్కర్ల నియమాకాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాలువల పరిధిలో గండ్లు పడకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తాం.' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పొదిలాపు విజయరత్నం, డీఈఈ వై.గనిరాజు, జేఈ రమణ తదితరులు పాల్గొన్నారు.



పాత రెగ్యులేటర్ నుంచి సాగునీరు విడుదల చేస్తున్న దృశ్యం

యూరియా

కొరత లేకుండా చూస్తాం

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్

వీరఘట్టం, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేకుండా చూస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. బుధవారం చలివేంద్రి, వండవ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఎక్కడ యూరియా కొరత లేదన్నారు. ప్రస్తుతం ఆకుమడుల్లోకి వేసుకోవడానికి యూరియా పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఆర్‌ఎస్‌కేల నుంచి అధిక మొత్తంలో యూరియా పంపిణీ చేస్తామన్నారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సౌజన్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి

అతివలకు అండగా

వన్‌స్టాప్ సెంటర్

- ఏఎస్పీ అంకితా సురాన

బెలగాం, జూలై 16(ఆంధ్రజ్యోతి) : వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు అండగా ఉంటుందని పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురాన తెలిపారు. బుధవారం పార్వతీపురం పట్టణంలో వన్‌స్టాప్ సెంటర్‌ను డీఆర్వో హేమలతతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని రికార్డులు తనిఖీ చేశారు. పోక్సో కేసుల బాధితులకు అందిస్తున్న సేవల వివరాలపై ఆరా తీశారు. పనుల ప్రదేశంలో మహిళల రక్షణ కోసం ఇప్పటివరకు 435 ఇంటర్నల్ కంప్లైట్ కమిటీల ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా కమిటీల నుంచి ప్రతి నెల నివేదకలు తెప్పించుకోవాలని ఏఎస్పీ సూచించారు. మహిళలు ధైర్యంగా పనిచేసుకునేలా ఇంటర్నల్ కంప్లైట్ కమిటీలు పని చేయాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్ కోసం కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వన్‌స్టాప్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏఎస్పీ

పక్కాగా పీ-4 గ్రామసభలు: కలెక్టర్



వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్యలో పక్కాగా పీ-4 గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. బంగారు కుటుంబాలుగా ఎంపికైన వారి జాబితాలను ఆయా గ్రామ సచివాలయ, మండల స్థాయిలో ప్రదర్శించాలన్నారు. గ్రామసభలను నిర్వహించి ఆ జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య మెరుగు పనులు చేపట్టాలన్నారు. ఈ శనివారం జిల్లావ్యాప్తంగా ' స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ ' నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల వారు పాల్గొనేలా చూడాలన్నారు. తొలుత ప్రణాళిక శాఖ కన్సల్టెంట్ అమిత్‌గుప్తా.. పీ-4పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి

భామిని, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి ఆదేశించారు. బుధవారం తాలాడలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఇంటింటా జ్వరాల సర్వేపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కాలువలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. వాటర్ ట్యాంక్‌లను 15 రోజుల వ్యవధిలో శుభ్రం చేయాలని తెలిపారు. అనంతరం వైద్యాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో 51 మందికి వైద్య పరీక్షలు చేయగా 11 మందికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. వారిలో ఆరుగురి రక్తనమూనాలను రిమ్స్‌కు పంపించారు.



తాలాడలో జ్వరాల సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

పొగాకుతో ఆరోగ్యానికి చేటు

- ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ

6లో

అగ్నిమాపక శాఖ

కార్యాలయానికి మోక్షం

- పాలకొండలో భవన నిర్మాణానికి రూ.కోటి 35 లక్షలు మంజూరు

చదువులకు

6లో

ప్రభుత్వ సాయం

- సంఘాల్లోని మహిళల పిల్లలకు ప్రయోజనం
- త్వరలో 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం'

నాన్ జ్యుడీషియల్

6లో

స్టాంపుల కొరత!

- బ్లాక్ మార్కెట్‌లోనూ నెల రోజులుగా ఇబ్బందులు
- రూ.10 స్టాంపు రూ.50కి విక్రయిస్తున్న వెండర్లు

ఇండోనేషియాకు మామిడిపల్లి కుర్రోడు

- బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్ కోచ్‌గా వెళ్లిన జిల్లావాసి
- గ్రామస్థులు, కుటుంబ సభ్యుల హర్షం

సాలూరు రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): వండర్ బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌కు మామిడిపల్లి వాసి కనకల వరప్రసాద్ కోచ్‌గా వెళ్లారు. ఇండోనేషియా దేశం సోలో నగరంలో ఈ నెల 18 నుంచి 27 వరకు పీబీఎస్ఐ (పెర్‌శాటన్ బూలుటాయక్లీస్ సెలుర్హ్ ఇండోనేషియా) ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. భారత్ తరఫున 28 మందితో కూడిన క్రీడాబృందం ఇప్పటికే ఆ నగరానికి చేరుకుంది. ఈ బృందంలో 19 మంది ఆటగాళ్లు, ఐదుగురు కోచ్‌లు (ఒకరు రష్యా, మరొకరు దక్షిణ కొరియా, ముగ్గురు భారతీయులు) ఇద్దరు ఫిజియో, ఒక ట్రైనర్, ఒక మాసేస్ ఉన్నారు. అయితే ఐదుగురు కోచ్‌ల్లో ఏపీ నుంచి పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం మామిడిపల్లికి చెందిన వరప్రసాద్ ఒకరు ఉండడం విశేషం.



ఇండోనేషియాకు భారత్ కోచ్‌గా వెళ్లిన వరప్రసాద్

ఆయన మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆ సమయంలో అప్పటి పీడీ శ్రీరాములు వద్ద బ్యాడ్మింటన్‌లో మెలకువ నేర్చుకున్నారు. అనంతరం నంద్యాలలో వెంకట్, ఖమ్మంలో సుధాకర్‌రెడ్డి వద్ద ప్రావీణ్యం పొందారు. వివిధ రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొని పలు అవార్డులు కైవసం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో కోచ్ దిలీప్ వద్ద కోచ్‌గా వ్యవహరించే తీరు, సామర్థ్యం తదితర వాటిపై శిక్షణ పొందారు. ప్రస్తుతం అస్సాం రాష్ట్ర బ్యాడ్మింటన్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు కోచ్‌గా ఎంపికై ఇండోనేషియా వెళ్లారు. దీనిపై మామిడిపల్లి వాసులు, కుటుంబ సభ్యులు, పూర్వ పీడీ శ్రీరాములు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టిడ్కో ఇళ్లలోనే

సంక్రాంతి చేసుకునేలా చర్యలు

- లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు అవకాశం
- టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

సాలూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): టిడ్కో లబ్ధిదారులు వారి ఇళ్లలోనే వచ్చే సంక్రాంతి పండుగ చేసుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. పెండింగ్ టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశాలకు అవకాశం కల్పిస్తామన్నారు. పట్టణంలోని చంద్రంపేట సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్ల గృహ సముదాయాలను బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ' బ్యాంకులో లోను తీసుకున్నట్లుగా అధికారులు మాతో సంతకాలు పెట్టించుకున్నారు. దీంతో సుమారు రూ.3 లక్షలకు పైగానే ఈఎంఐల రూపంలో బ్యాంకు అధికారులు తీసుకున్నారు.' అని లబ్ధిదారులు కనకల కనక, అర్జి సూర్యనారాయణ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్లలో తాము ఉండకపోయినా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలన 'తల్లికి వందనం' పథకం వర్తించలేదని మరికొందరు వాపోయారు. అనంతరం అజయ్‌కుమార్ మాట్లాడుతూ..' 2014-19లో రూ. 28వేల500 కోట్లతో 4 లక్షల 52వేల టిడ్కో ఇళ్లు నిర్మించేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం 2లక్షల 60 వేల ఇళ్ల నిర్మాణాలే చేపట్టింది. దీంతో ఎంతోమంది లబ్ధిదారులు నష్టపోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం 365, 430 చదరపు అడుగుల ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టేందుకు ప్రయత్నిస్తోంది. గత ప్రభుత్వం డీడీల రూపంలో తప్పుడు లెక్కలు చూపించి కోట్ల రూపాయలను పక్కదారి పట్టించింది. డీడీల రూపంలో చెల్లించినవారికి తిరిగి డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. 2025, మే 30 వరకు కూడా ప్రభుత్వమే ఈఎంఐలను కడుతుంది. అన్ని రకాలుగా టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేస్తాం.' అని ఆయన తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, తూర్పుకాపు రాష్ట్ర చైర్మన్ యశస్వి, జనసేన పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

చదువులకు ప్రభుత్వ సాయం

- సంఘాల్లోని మహిళల పిల్లలకు ప్రయోజనం
- త్వరలో 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం'

పెద్ద చదువులు చదవాలని, ఉన్నత ఉద్యోగాలు పొందాలని కలలు కంటారు. అయితే తలిదండ్రుల ఆర్థికపరమైన నేపథ్యం వీరి కలలను కల్లలు చేస్తోంది. ఇలాంటి వారికి ఆసరాగా ఉండాలని ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించి తల్లుల ఖాతాల్లోకి 13 వేలు వంతున జమ చేసింది. అంతేకాకుండా చదువులకు, ఇతర విద్యాపరమైన ఖర్చుల కోసం స్వల్ప వడ్డీలకు రుణాలు కూడా అందజేయాలని యోచిస్తోంది.



సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

చీపురుపల్లి, జులై 16 (ఆంధ్రజ్యోతి)

మహిళా సంఘాల సభ్యుల పిల్లల చదువులకు భరోసానిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి రూపకల్పన చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకంలో భాగంగా స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా రుణం మంజూరు చేయాలని నిర్ణయించింది. అందుకు సంబంధించిన విధి విధానాలను ఇప్పటికే సిద్ధం చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న పథకం ద్వారా మహిళా సంఘాల సభ్యుల పిల్లల చదువుకు చేదోడు లభించనుంది. విద్యా వికాసానికి దోహదపడేందుకు 35పైసల వడ్డీతో స్త్రీనిధి రుణాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేసే విధంగా విధి విధానాలను రూపొందించారు.

- విజయనగరం జిల్లాలో ప్రస్తుతం 40,522 పొదుపు సంఘాలున్నాయి. వీటిలో 4,46,247 మంది సభ్యులు నమోదై ఉన్నారు. జిల్లాలో పొదుపు సంఘాల్లో నమోదై ఉన్న వారిలో దాదాపు 75 శాతం మంది మహిళలు పేద, నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే.

పథకం వర్తించేదిలా...

ఎన్టీఆర్ విద్యాసంకల్పం పథకం ద్వారా పొందిన రుణాలను 35 పైసల వడ్డీతో రెండు నుండి మూడు సంవత్సరాల వ్యవధిలో తిరిగి చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు ఇతర కోర్సులు చదివే సంఘాల సభ్యుల పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకూ ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఈ రుణాలను పూర్తిగా పిల్లల చదువుల కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, సాంకేతిక విద్యాసామగ్రి వంటివి కొనుగోలుకు రుణాన్ని ఖర్చు చేయాలన్న నిబంధన విధించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు సైకిళ్లను కూడా కొనుగోలు చేసుకోవచ్చు. పిల్లలు చదువుల కోసం ఖర్చు పెట్టిన వివరాలకు సంబంధించిన రశీదులను స్త్రీనిధి అధికారులకు అందించాల్సి ఉంటుంది. పిల్లల అవసరానికి అనుగుణంగా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకూ స్త్రీనిధి రుణాలు అందించాలని నిర్ణయించారు.

పిల్లల చదువు కోసం మంచిదే..



పిల్లల చదువుల కోసం స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకి రుణాలిస్తే పేద కుటుంబాలకు చాలా మేలు జరుగుతుంది. ఈ పథకం మంచిదే. పిల్లలను ఉన్నత విద్య చదివించుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు ఒక వరంలాంటిది.

-నిశాని లక్ష్మి, శ్రీరామ మహిళా పొదుపు సంఘం, చీపురుపల్లి

ప్రభుత్వం చాలా సాయం చేస్తోంది..



తల్లికి వందనం పథకంతో పిల్లల చదువు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సహకరిస్తోంది. స్త్రీనిధి ద్వారా రుణాలిస్తే పెద్ద చదువులకు ఉపయోగపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళ సభ్యుల పిల్లల ఉన్నతికి దోహదపడుతుంది.

-వల్లూరి శారద, జై దుర్గాభవానీ పొదుపు సంఘం, పాలవలస, గుర్ల మండలం

మార్గదర్శకాలు రాలేదు..

అందిరితో బాటు మేము కూడా సోషల్ మీడియాలోను, పత్రికల్లోను వార్తలు చూస్తున్నాం. డ్వాక్రా మహిళల పిల్లల చదువుల కోసం స్త్రీనిధి ద్వారా రుణాలివ్వాలన్న ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉంది. ఈ అంశంపై ఇప్పటి వరకూ మాకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తగిన చర్యలు తీసుకుంటాం.

-కల్యాణచక్రవర్తి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, విజయనగరం

సామాజిక స్పృహ కలిగి ఉండాలి

- కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

విజయనగరం టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలని కేంద్రమాజీ మంత్రి పి.అశోక్ గజపతిరాజు అన్నారు. వివిధ సందర్భాల్లో ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఇచ్చిన పుస్తకాలు, పెన్నులను బుధవారం నగరంలోని కొణిసివీధి, జొన్నగుడ్డి, ఎరుకులపేటలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నదని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరణ చేస్తోందని కొనియాడారు. విద్యార్థులు తమ భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చదుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న దృశ్యం

డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించాలి

- పెండింగ్‌లో ఉన్న రూ.6వేల కోట్లు విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ నాయకుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, సంఘ నాయకులు

విజయనగరం కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదలై నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారంతా విద్యార్థులతో కలిసి బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించక పోవడం ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శమని, వెంటను ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం హయంలో పెండింగ్‌లో ఉన్న రూ6వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో.77ను వెంటనే రద్దు చేయాలన్నారు. విద్యార్థులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, విద్యార్థులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం ఇన్‌చార్జి డీఆర్వో మురళికి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కోరెడ్ల రమాదేవి, విద్యార్థి సంఘ నాయకులు డి.రాము, వెంకటేష్, చినబాబు, రవికుమార్, సమీరా, వెంకి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గేట్లు ఎక్కి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత!

- బ్లాక్ మార్కెట్‌లోనూ నెల రోజులుగా ఇబ్బందులు
- రూ.10 స్టాంపు రూ.50కి విక్రయిస్తున్న వెండర్లు



గజపతినగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత నెల రోజులుగా మార్కెట్‌లో కొరత తీవ్రంగా ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని వెండర్లు అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లోనూ నిండుకున్నాయి. నెల రోజులుగా రూ.10, రూ.20 స్టాంపులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యధిక మంది వెండర్ల వద్ద స్టాంపులు లేవు. ఉన్న వారు రూ.10 స్టాంపు రూ.50కు బ్లాక్‌లో విక్రయించగా.. రూ.20 స్టాంపు రూ.60కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ అధికారులు స్పందించడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లను పూర్తిగా తొలగించి రిజిస్ట్రేషన్ 2.0 పేరుతో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులతో సంబంధం లేకుండానే ఈ స్టాంపింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. చివరకు ఈ స్టాంపింగ్‌ను కూడా ప్రైవేటు ఏజెన్సీకి కేటాయించారు. దీనిపై ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమయినా ప్రభుత్వం ముందుకే వెళ్లింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాన్ జ్యుడీషియల్ స్టాంపుల వినియోగాన్ని గతంలో మాదిరిగా కొనసాగించాలని ఆదేశించింది. అయితే ఇందుకు సంబంధించి నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచే విధంగా చర్యలు మాత్రం చేపట్టడంలేదు. దీంతో నెలరోజులుగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి నాన్ జ్యుడీషియల్ స్టాంపుల వినియోగం ఎక్కువైంది. ప్రజలు అధికంగా రూ.10, రూ.20, రూ.50, రూ.100 స్టాంపులను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే అవి అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెప్పిస్తున్నప్పటికీ వాటిని క్షేత్ర స్థాయిలో వెండర్లకు అందజేయడంలో జాప్యం జరుగుతోంది. వెండర్ల వద్ద ఉన్న స్టాంప్‌లను నోటరీ కోసం అధిక సంఖ్యలో న్యాయవాదులు కొనుగోలు చేసుకుపోతున్నారు. దీంతో వాటికి డిమాండ్ పెరిగిపోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. వెండర్ల వద్ద నుంచి ఒకే పర్యాయం 100 నుంచి 200 వరకు రూ.10, రూ.20 స్టాంపులు తీసుకువెళ్లి పాత తేదీలతో వారు క్లయింట్‌లకు వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలు లేక పోలేదు. నాన్ జ్యుడీషియల్ స్టాంపులను బ్లాక్ చేస్తే ప్రజలు ఈ స్టాంపింగ్ వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు కొరతకు ఇదే కారణమని వెండర్లు ఒక వైపు ఆరోపిస్తున్నారు. దస్తావేజులు, ఒప్పందాలు మినహా మిగిలిన వాటికి ఈస్టాంపింగ్ వినియోగించుకుందామన్నా సర్వర్ సమస్య కావడంతో అవి కూడా అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ అధికారులు రూ.10, రూ.20 స్టాంపులను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకువస్తాం..

రెండు రోజుల్లో రూ.10, రూ.20 స్టాంపులు ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. రిజిస్ట్రేషన్ శాఖకు వచ్చిన స్టాంపులను ఇటీవల పోస్టుఫీసుల్లో విక్రయాలు చేపట్టేవిధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇంతరవకు పోస్టాఫీసుల్లో విక్రయాలు సాగలేదు. ఆ శాఖకు ఇచ్చిన స్టాంపులను జిల్లా అధికారుల దృష్టిలో పెట్టి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకువచ్చి ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

-ఎస్.తవిటయ్య, సబ్ రిజిస్ట్రార్, గజపతినగరం



వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మార్గదర్శులను వెంటనే రిజిస్టర్ చేయండి
- కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశాలు

విజయనగరం కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాల కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టరు బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు. బుధవారం తన చాంబర్ నుంచి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ పైపులైన్ లీకేజీలు లేకుండా చూడాలని, నీటి కాలుష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. క్లోరిన్, బ్లీచింగ్ పిచాకారీ, పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జడ్పీ సీఈవో, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, ఏదేని ఘటనలు జరిగినా వీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మండల స్థాయిలో ఈవోపీఆర్‌డీలు, ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అన్ని ఆర్ఎస్‌కేలలో సరిపడా ఎరువులను సిద్ధంగా ఉంచామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మండలాలవారీగా లబ్ధిదారులను పరిశీలించి అర్హులైన వారి జాబితా సిద్ధం చేయాలన్నారు. పి4 కింద పేదలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శిలను గుర్తించి వెంటనే రిజిస్టర్ చేయించాలన్నారు. పేదలకు ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి, వారికి తగ్గ మార్గదర్శిలను ఎంపిక చేయాలని ఆదేశించారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా మూడో శనివారం 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొద్దిద్దాం' అనే నినాదంతో కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

గురుకులాల్లో ఖాళీ సీట్లకు 19న కౌన్సెలింగ్..

బీఆర్ అంబేద్కర్ గురుకులు విద్యాలయాల్లో 5 నుంచి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 19న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 983 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.



పొగాకు నియంత్రణ కార్యక్రమంపై సంతకం చేస్తున్న పీవో శ్రీవాస్తవ

పొగాకుతో ఆరోగ్యానికి చేటు

- ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పొగాకుతోఆరోగ్యానికి చేటు అని, దీని దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్‌శ్రీవాత్సవ తెలిపారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా సంతకాల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన బ్యానర్‌పై ముందుగా సంతకం చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆరోగ్యానికి చేటు కలిగించే దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సిగిరెట్, బీడీ, చుట్ట, ఖైనీ, గుట్కా తదితర పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ఎంతో మంది క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అందరిచే పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్‌వో కేవీఎస్ పద్మావతి, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, ప్రోగ్రాం అధికారులు రఘుకుమార్, కౌశిక్, క్వాలిటీ కన్సల్టెంట్ రఘు, కౌన్సిలర్ భవానీ, డెమో సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆలయంపై పిడుగు

శృంగవరపుకోట రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్న రామాలయంపై బుధవారం సాయంత్రం పిడుగుపడి శిఖరం కింది భాగం దెబ్బతింది. ఆ సమయంలో పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.



దెబ్బతిన్న ఆలయ భాగం

అగ్నిమాపక శాఖ కార్యాలయానికి మోక్షం

- పాలకొండలో భవన నిర్మాణానికి రూ.కోటి 35 లక్షలు మంజూరు

పాలకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో అగ్నిమాపక శాఖ కార్యాలయం భవనం నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మేరకు కొత్త భవన నిర్మాణానికి రూ.కోటి 35 లక్షలు మంజూరయ్యాయి. ఇక్కడ రెండు దశాబ్దాల కిందట శిథిలావస్థకు చేరిన భవనంలోనే బిక్కుబిక్కుమని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పలుసార్లు అగ్నిమాపక సిబ్బందిపై పెచ్చులుపడి గాయపడిన విషయం విదితమే. ఈనేపథ్యంలో భవన దుస్థితిని గతంలో పని చేసిన అగ్నిమాపక అధికారులతో పాటు ప్రస్తుత అగ్నిమాపక అధికారి చొరవ తీసుకొని రేకులషెడ్‌ను ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహిస్తున్నారు. ఈ తరుణంలో భవనం పరిస్థితిని ఉన్నతాధికా రులు, ప్రజాప్రతినిధుల దృష్టికి పలుసార్లు తీసుకువెళ్లిన విషయం విదితమే. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు ఉన్నతాధికారులకు భవనం దుస్థితిపై నివేదించారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దృష్టికి కూడా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అగ్నిమాపకశాఖ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ శంకుస్థాపన చేయనున్నారు. కోటి 35 లక్షలతో ఆరు గదులు నిర్మించనున్నారు. అగ్నిమాపక శకటాన్ని ఉంచేందుకు ప్రత్యేక షెల్టర్‌ను ఏర్పాటు చేయనున్నారు.



శిథిలావస్థకు చేరిన అగ్నిమాపక కేంద్రం

అశోక్‌ని కలిసిన స్పీకర్



అశోక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విజయనగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాలయ అయ్యన్నపాత్రుడు బుధవారం ఆయన నివాసంలో కలిసి, అభినందించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నీతికి, నిజాయితీకి, నిరాడంబరతకు అశోక్ మారు పేరని అన్నారు. గవర్నర్ పదవికి అశోక్ వన్నె తెస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అశోక్



కలెక్టర్‌తో చర్చిస్తున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా పదవి చేపట్టనున్న కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు బుధవారం కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్‌ను తన చాంబర్‌లో కలిశారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు. అనంతరం అశోక్ గజపతిరాజుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.2.47లక్షలు

చీపురుపల్లి, జులై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి హుండీల ద్వారా రూ.2లక్షల 47వేల 455 ఆదాయం లభించింది. 2025 ఏప్రిల్ 28 నుంచి జులై 16 వరకూ భక్తులు హుండీల్లో వేసిన కానుకలు దేవదాయ తనిఖీ అధికారి జి.శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, ఈవో బండ్లమూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు సినీ నటుడు సుమన్ రాక

విజయనగరం రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు సుమన్ ఈనెల 18న విజయనగరం రానున్నారు. ఆ రోజు బొబ్బిలి, విజయనగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం అదే రోజు రాత్రి తిరిగి ఆయన బయలుదేరి వెళ్తారు. ఈ మేరకు ఆయన పర్యటన ఏర్పాట్లను ఆయన అభిమానులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేగిడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉంగరాడ మెట్ట సబ్‌స్టేషన్, తునివాడ ఫీడర్ పరిధిలో విద్యుత్‌లైన్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఏఈ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తునివాడ, వెంకమ్మపేట, కందిశ, కోడిశ, చెలిగానవలస, జోడుబందల తదితర 9 గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రేగిడి పీఏసీఎస్ చైర్మన్‌గా మహేశ్వరరావు

రేగిడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రేగిడి పీఏసీఎస్ చైర్మన్‌గా అడవరం మాజీ సర్పంచ్ కర్ణేన మహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు విడుదలైనట్టు ఆయన బుధవారం తెలిపారు. తనతో పాటు సభ్యులుగా వావిలవలస మాజీ ఎంపీటీసీ పాలూరి రమినాయుడు, నాయిరాలవలస సర్పంచ్ ప్రతినిధి విక్రాంత్‌కుమార్ ఎంపికైనట్టు చెప్పారు. ఈ ఎంపికకు సహకరించిన రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌రావు, టీడీపీ మండల కేడర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

శృంగవరపుకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. శ్రీబాలాజీ, శ్రీశ్రీనివాస ట్రేడింగ్ దుకాణాల్లో జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు రామారావు, విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు, ఏవో కె.రవీంద్ర తనిఖీలు చేపట్టారు. ఎరువుల నిల్వలు, ఈపోస్ యంత్రంలోని అమ్మకాల్లో లోపాలు ఉన్నట్టు గుర్తించారు.

అధిక ధరకు అమ్మితే చర్యలు

జామి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరకు అమ్మితే డీలర్లపై చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రామరావు హెచ్చరించారు. బుధవారం జామిలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు, ఏవో పూర్ణిమ ఆధ్వర్యంలో ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టాకు నిల్వలు పరిశీలించారు.

జాగరంలో తాగునీటికి ఇబ్బందులు

జామి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జాగరం గ్రామంలో ప్రజలు ప్రతిరోజూ తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ వసి పార్వతి బుధవారం మాట్లాడుతూ పంచాయతీ కుళాయిల ఆపరేటర్ శివకు పది నెలలు జీతం బకాయి ఉండడం వల్ల కుళాయిలు ఆన్ చేయడంలేదని చెప్పారు. అదే విధంగా పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఈ విషయాలపై పంచాయతీ కార్యదర్శికి చెబితే తమ మాటలు పట్టించుకోవడం లేదని, ఏమడిగినా మీటింగ్ పెట్టాలని దాట వేస్తున్నారని వాపోయారు. ఇక సర్పంచ్‌గా ఉండి ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని వాపోయారు.

నిత్యం ట్రాఫిక్ జాం

- రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్
- ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రజలకు తప్పని అవస్థలు
- ఇదీ రైతుబజార్ వద్ద పరిస్థితి



రైతుబజార్ మార్గంలో ఇదీ పరిస్థితి

విజయనగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి అంబులెన్స్‌లు వెళ్లాలన్నా.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన ఇంటికి వెళ్లాలన్నా ఇదే దారి.. ఈ దారిలో ఫుట్‌పాత్ వ్యాపారులు రోడ్డుకు ఇరువైపుల వ్యాపారాలు చేస్తూ ఉంటారు. అక్కడే భారీగా వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ నగరంలోని ఆర్‌అండ్‌బీ రైతు బజార్ మార్గంలోని పరిస్థితి. మంత్రి కొండపల్లి తన నివాసానికి ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. అనేక పర్యాయాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయి. అదేవిధంగా కేంద్రాసుపత్రికి వెళ్లే వాహనాలు, అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. విజయనగరం మండలంలోని దుప్పాడ, జొన్నవలస, పినవేమలి, రాకోడు తదితర గ్రామాలతో పాటు పట్టణ ప్రజలు, ఉడా కాలనీ, పాల్ నగర్, అయ్యన్నపేట ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఆర్‌అండ్‌బీ రైతుబజార్ వద్ద ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు క్రమబద్ధీకరణ చర్యలు చేపడుతున్నా పరిస్థితి మళ్లీ యాధాస్థితి వస్తోంది.

జీబ్రాలైన్‌లు ఏర్పాటు చెయ్యాలి

ఆర్‌అండ్‌బీ రైతుబజార్ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా.. ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడుబళ్ల వర్తకులు ప్రధాన రహదారి పైకి రాకుండా నగర పాలక సంస్థ అధికారులు జీబ్రాలైన్‌లు ఏర్పాటు చెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ప్రక్రియ త్వరితగతిన చేపడితే ట్రాఫిక్ నియంత్రణకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు చేపట్టి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇది పేదల ప్రభుత్వం



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, జులై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తోందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జి.అగ్రహారంలో బుధవారం ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. పార్టీ నాయకులు గద్దే బాబూరావు, కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, రౌతు కాంతమ్మ, గవిడి నాగరాజు, కలిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నారు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె వేపాడలో పర్యటించారు. రానున్న సంస్థగత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందడుగు



ఇంటింటి ప్రచారం చేస్తున్న రవిశేఖర్

నెల్లిమర్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ముందడుగు కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. సారిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్టీ నాయకులు పోతల రాజప్పన్న, సారిపల్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ పద్ధతులపై అధ్యయనం

విజయనగరం రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అప్కాబ్ ఆధ్వర్యంలో అయోధ్య జిల్లాలోని కోఆపరేటివ్ పద్ధతులపై అధ్యయనం చేశామని డీసీసీబీ చైర్మన్ నాగార్జున తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీసీసీబీ చైర్మన్లు అప్కాబ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు లక్నో, అయోధ్యలోని పలు కో-ఆపరేటివ్ సంస్థలను సందర్శించి, అవి అందిస్తున్న సేవలను తెలుసుకున్నారని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలని ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న దానిపై క్షుణ్ణంగా తెలుసుకున్నామని ఆయన తెలిపారు.

కొనసాగుతున్న బీఎల్వోలకు శిక్షణ

విజయనగరం రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో)లకు శిక్షణ కార్యక్రమం నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో కొనసాగుతున్నది. నియోజకవర్గ ఏఈఆర్‌వో స్వర్ణకుమార్, ఎలక్షన్ డీటీ దాసరి గాంధీ, సీనియర్ సహాయకుడు పొందల శివశంకర్, మాస్టర్ ట్రైనీలు ఎస్.మధు, ఇంకుల వెంకటేష్‌ల పర్యవేక్షణలో జరిగింది. ఈసందర్భంగా ఏఈఆర్‌వో స్వర్ణకుమార్ మాట్లాడుతూ ఆర్డీవో దాట్ల దీప్తి, తహసీల్దార్ కూర్మనాథరావు ఆదేశాల మేరకు విజయనగరం నియోజకవర్గంలో గత నాలుగు రోజులుగా బీఎల్వోలకు శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు.

సాగునీరు అందించేందుకు చర్యలు

గజపతినగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు చివరి ఎకరా వరకు సాగునీరు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఇరిగేషన్ శాఖ డీఈఈ రాంనాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆంధ్ర ప్రాజెక్టు పరిధిలోగల గజపతినగరం, బొండపల్లి మండలాలకు పూడిక తీత పనులు చేపడుతున్నట్టు చెప్పారు. గజపతినగరం మండలంలో చేపడుతున్న 4 పనులకు సంబంధించి రూ.56లక్షలు, బొండపల్లి మండలానికి సంబంధించి 7 పనులకు గాను రూ.46లక్షలు ఖర్చు చేస్తున్నట్టు వివరించారు. అలాగే 6 హెడ్ వర్కర్ల పనులు చేపట్టేందుకు రూ.91లక్షల 7వేలకు టెండర్లు పిలిచామని చెప్పారు.

పెదతాడివాడలో నమస్తే డే

డెంకాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెదతాడివాడ పంచాయతీలో బుధవారం నమస్తే డే (నేషనల్ ఏక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ పంచాయతీ అధికారి రౌతు శిరీషరాణి హాజరై క్లాప్ మిత్రలకు సన్మానించారు. ఒక్కొక్కరికి రైస్ బ్యాగ్, పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం వారికి హెల్త్ చెకప్‌లు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే గ్రామంలో ర్యాలీగా వెళ్లి ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు పాల్గొన్నారు.

అశోక్ మహనీయుడు

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

డెంకాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు మహనీయుడని.. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగారని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కొనియాడారు. మండలంలోని చొల్లంగి తదితర గ్రామాల్లో బుధవారం నిర్వహించిన బాబు షూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పూసపాటి అశోక్‌గజపతిరాజుకు గోవా గవర్నర్‌గా నియమించడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి పూసపాటి వంశీయులు అశోక్ గజపతిరాజు ఎంతో కష్టపడ్డారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

వేతనాలు చెల్లించాలి

భోగాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు చెల్లించాలని కోరుతూ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తమకు గత మూడు నెలలుగా వేతనాలు అందలేదని, ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అనంతరం మండల పరిషత్ ఏవో కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

పోరాటం కొనసాగించండి

- మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం

శృంగవరపుకోట రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): 'మీరు మీ భూముల కోసం చేస్తున్న పోరాటంలో న్యాయం ఉంది.. ఏ ఒక్కరికీ భయపడకండి.. మీ పోరాటం మీరు కొనసాగించండ'ని పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠలపు బాలసుబ్రమణ్యం జిందాల్ నిర్వాసితులను ఉద్దేశించి అన్నారు. బుధవారం బొడ్డవర గ్రామంలో ఎమ్మెల్సీ నివాసం వద్ద నిరసన చేస్తున్న వారిని ఆయన కలిసి, మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీలంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఉద్యమాలు ఏనాడు వృథా కాలేదన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ 'ఆనాడు నేను భూములు ఇమ్మంటే ఇచ్చారని.. నేడు అదే భూములు నష్టపోయి నా ఇంటి వద్ద న్యాయం చేయాలని కోరుతున్నార'ని తెలిపారు. వారి కోసం ఏం వదులుకోవడానికైనా సిద్ధమని ప్రకటించారు. రైతు సంఘ నేత చల్లా జగన్ మాట్లాడుతూ శాంతియుత పోరాటం చేస్తున్న వారిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

విజయనగరం క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న పోలీసు ఉద్యోగులు, హోంగార్డులకు బుధవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల అర్ధాంతరంగా అస్వస్థతకు గురై మృతిచెందుతున్న సంఘటనలు సంభవిస్తున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మెడికవర్, క్వీన్ ఎన్ఆర్ఐ, జీఎంఆర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎస్పీలు సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, సీఐలు లీలారావు, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌కుమార్, టి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

రాజాంలో..

రాజాం రూరల్: పోలీస్ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అందరికీ అన్నిరకాల వైద్య పరీక్షలు జరిపిస్తున్నామని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు తెలిపారు. బుధవారం రాజాంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలోని రాజాం టౌన్, రూరల్ సర్కిల్ సీఐలు అశోక్‌కుమార్, ఉపేంద్రరావు, ఎనిమిది మంది ఎస్ఐలు, 16 మంది ఏఎస్ఐలు, 33 మంది హెచ్‌సీలు, 110 మంది కానిస్టేబుల్స్, 23 మంది మహిళా కానిస్టేబుళ్లు, 44 మంది హోంగార్డులు, 15 మంది డ్రైవర్లకు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యపరీక్షలు జరిపించామని ఆయన వెల్లడించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

భోగాపురం, జూలై16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి డీవీ మల్లికార్జునరావు పంచాయతీ సిబ్బందికి సూచించారు. భోగాపురం పంచాయతీలో పారిశుధ్య నిర్వాహణను ఆయన బుధవారం పరిశీలించారు. స్థానికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పైప్ లీకేజీలు తదితర వాటిని పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు నిర్వహిస్తుండాలని, వాటర్ ట్యాంకులు, బోర్లు, బావుల్లో క్లోరినేషన్ చేయిస్తుండాలని పంచాయతీ అధికారులకు సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో కె.గాయత్రి, కార్యదర్శి పుష్పావతి పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

రేగిడి, జూలై 16,(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో ప్రజలు సహకరించాలని చీపురుపల్లి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి హేమసుందరరావు కోరారు. మండలంలో ఐవీఆర్ఎస్ పంచాయతీగా ఎంపికైన పెద్దశిర్లాంలో ఆయన బుధవారం పర్యటించారు. అనంతరం ఆమదాలవలసలో నమస్తే డే కార్యక్రమంలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న నలుగురు గ్రీన్ అంబాసిడర్లకు సత్కరించారు. అనంతరం చాటాయివలస సచివాలయాన్ని సందర్శించి, స్వర్ణ పంచాయతీ పోర్టల్ నమోదుపై సిబ్బందితో సమీక్షించారు. ఆయన వెంట ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావు ఉన్నారు.

సీఐ శ్రీనివాస్ బదిలీ తీరుపై విమర్శలు వస్తున్నాయి

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్‌ను బదిలీ చేసిన తీరుపై ప్రజల్లో విమర్శలు వినిపిస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఎస్పీ వకుల్ జిందాల్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన్ని కలిసి, వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించకపోతే, తగిన చర్యలు తీసుకునే అధికారం ఉన్నతాధికారులకు ఉందని అన్నారు. అయితే సీఐ శ్రీనివాస్ బదిలీ రాత్రి రాత్రికే చేయాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ నాయకుడు ఆదేశాలు అమలు చేసే ముందు పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించాల్సి ఉందన్నారు.

రేగ పుణ్యగిరి రోడ్డుకు భూమి ఇవ్వండి

శృంగవరపుకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పంచాయతీ శివారు రేగపుణ్యగిరి గిరిజన గ్రామ రోడ్డు నిర్మాణానికి పది సెంట్లు భూమి ఇవ్వడంతో పాటు పోడు భూములకు సర్వే చేయించాలని గిరిజనులు కోరారు. ఈ మేరకు బుధవారం జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడుతో కలిసి స్థానిక తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4కోట్లు నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరారు. పల్లపు దుంగాడ- దబ్బగుంట రోడ్డుకు అటవీ అనుమతులు ఇప్పించాలని టిడ్కో చైర్మన్ వి.అజయ్‌కుమార్‌కు విజయనగరంలో వినతిపత్రం అందించారు.

దోమల నియంత్రణకు చర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దోమల నియంత్రణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. బుధవారం ఆయన ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది పలు ప్రాంతాల్లో దోమల వృద్ధి కేంద్రాలను నశింపచేయడానికి ఆయిల్ బాల్స్‌ని విడిచిపెట్టారు. అలాగే చెరువులు, కుంటలు, కాలువల్లో నీరు నిల్వ వున్న ప్రాంతాల్లో ప్రత్యేకించి తయారు చేసిన ఆయిల్ బాల్స్‌ని విడిచిపెట్టారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయిల్ బాల్స్‌ని చిన్న, చిన్న గోనె సంచుల్లో మూట కట్టి ఐదు రోజులు నిల్వ వుంచిన తర్వాత వాటిని ఆయా నీటి నిల్వల కేంద్రాల వద్ద విడిచిపెడతారని చెప్పారు. ఈ విధానం వల్ల సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పలు, టైర్లు, కుండీలు, ఫ్రిజ్‌లలో వృథా నీరు లేకుండా చూసుకుని దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు.

ఎస్.కోటలో భారీ వర్షం



ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో నిలిచిన వరదనీరు

శృంగవరపుకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. స్థానిక దేవీబొమ్మ కూడలి నుంచి ఆకుల డిపో వరకు విశాఖ-అరకు రోడ్డులో వరద నీరు ఏరులా ప్రవహించింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం పైనుంచి వచ్చిన వరదనీరు వెళ్లేందుకు వీలు లేక రోడ్డంతా నిండిపోయింది. ఇదే విధంగా శ్రీనివాస కాలనీ నుంచి వచ్చిన వర్షపు నీటితో కుర్ణి కోనేరు నిండిపోవడంతో షిర్డీసాయి దేవాలయం వద్ద విశాఖ-అరకు రోడ్డుపైకి నీరు వచ్చేసింది. ఇలా ఈ రోడ్డంతా వరద నీరు పొంగిపోర్లడంతో స్థానికులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. దీనికి తోడు పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే సమయం కావడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాచిపెంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనసలపాడుకు చెందిన పెదకాపు జయమ్మ(24) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందింది. పాచిపెంట పోలీసుల కథనం మేరకు.. పనసలపాడుకు చెందిన కుంచి జయమ్మకు అదే గ్రామానికి చెందిన పెదకాపు రవితో వివాహం జరిగి ఏడాది కావస్తోంది. మగ బిడ్డ జన్మించగా, అనారోగ్యం వల్ల బిడ్డ చనిపోయాడు. బిడ్డ చనిపోవడం, ఆర్థిక ఇబ్బందుల వల్ల జయమ్మ మానసిక క్షోభకు గురైంది. ఈ నేపథ్యం లో ఈనెల ఏడో తేదీన మధ్యాహ్నం జయమ్మ పురుగుల మందు తాగింది. కూలి పనులకు హైదరాబాద్ వెళ్లిన జయమ్మను అక్కడ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు జయమ్మ తల్లి కుంచి సావాలమ్మ మంగళవారం పాచిపెంట పోలీసులకు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.వెంకటసురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లెట్ వాహనాలే టార్గెట్

- పోలీసుల అదుపులో నిందితులు
- మొత్తం 13 బైకులు స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఎస్పీ, పోలీసులు

విజయనగరం క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఏడాది కాలంగా జిల్లా కేంద్రంలో బుల్లెట్ వాహనాల చోరీలు అధికమయ్యాయి. దీంతో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు దీనిపై పోలీసులు నిఘా పెట్టారు. ఎట్టకేలకు దొంగ దొరికాడు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్లు చోరీకి గురైనట్టు ఫిర్యాదులు అందాయని చెప్పారు. దీంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సస్పెక్ట్ షీటు కలిగిన తోటపాలెం, వైఎస్సార్ నగర్‌కు చెందిన విటి అగ్రహారం బీసీ కాలనీకి చెందిన ఉప్పడాల రాము అలియాస్ డీజేని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన తర్వాత రాము మళ్లీ బైకులు చోరీకి పాల్పడుతున్నాడని చెప్పారు. ఉప్పడాల రాము వద్ద ఏడు బైకులు, రాముకు సహకరిస్తున్న శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం ముద్దాడ పేటకు చెందిన ముద్దాడ నవీన్ అలియాస్ బైసన్ నుంచి ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. ఉప్పడాల రాము తాను చోరీ చేసిన బైకులను నవీన్ సహకారంతో విక్రయించేవాడని చెప్పారు. ఒకటో పోలీసు స్టేషన్‌కు చెందిన పది కేసుల్లో ఏనిమిది రాయల్ ఎన్‌ఫీల్డ్, రెండు యమహా బైకులు, టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు రాయల్ ఇన్‌ఫీల్డ్ బుల్లెట్‌లు ఉన్నాయని ఎస్పీ వివరించారు. కోర్టు ఆదేశాలతో బాధితులకు తిరిగి అందించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన వన్‌టౌన్ ఎస్ఐ సురేంద్రనాయుడు, హెచ్‌సీ రమణరావు, పీసీలు గౌరీశంకర్, శివశంకర్, టి.శ్రీనివాస్, పి.మంజులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో మాజీ సర్పంచ్ మృతి



తులసీరావు (ఫైల్)

బొండపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): గొట్లాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసాల తులసీరావు మంగళవారం రాత్రి పాము కాటుకు గురై మృతిచెందారు. బుధవారం ప్రజల సందర్శనార్థం ఆయన నివాసంలో పార్థీవ దేహాన్ని ఉంచారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం ఎంపీపీలు, జడ్పీటీసీలు సందర్శించి, అంజలి ఘటించారు. సతీమణి మీసాల సరోజిని ఉప ఎంపీపీగా సేవలందిస్తున్నారు. వైసీపీ నాయకుడు బీవీ ప్రభూజీరాజు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, బొద్దల చిన్నంనాయుడు, వర్రి నరసింహమూర్తి తదితరులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బాడంగి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగడ పంచాయతీ పరిధిలో గల ఎయిర్‌పోర్టు సమీపంలో సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టలేనంతగా మారిందని చెప్పారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బైకును ఢీకొన్న లారీ

- తెగిపడిన బైకిస్టు కాలు
- డ్రైవర్ పరారీ

బొబ్బిలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి గ్రోత్‌సెంటరు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మన్యం జిల్లా బలిజిపేట మండలం అరసాడకు చెందిన సత్యనారాయణ కాలు పూర్తిగా తెగిపడి నుజ్జునుజ్జయ్యింది. జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ బైకుపై గ్రోత్‌సెంటరు నుంచి పట్టణానికి వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ పరారయ్యాడు.


విప్‌పై అనుచిత పోస్టులు.. కేసు నమోదు

జియ్యమ్మవలస, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ మహిళా విభాగ కార్యకర్త ఎత్తిలి మణిపై జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టడంతో టీడీపీ మండల నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో తురకనాయుడువలస గ్రామానికి చెందిన మణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. నిందితురాలిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

బొబ్బిలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో ఇద్దరికి రూ.10వేలు చొప్పున బొబ్బిలి కోర్టు జరిమానా విధించినట్లు సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపారు. ఇటీవల మద్యం తాగి ట్రాక్టరు, ద్విచక్రవాహనం నడిపిన ఇద్దరికి బొబ్బిలి సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఇన్‌చార్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి హేమశ్రవంతి బుధవారం జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు చెప్పారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



విరిగిన విద్యుత్ స్తంభం

గజపతినగరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మెంటాడ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. విజయనగరం నుంచి మెంటాడ వైపు వెళ్తున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం మధ్యలో విరిగిపోయింది. ఈ ఘటన జరిగిన సమయంలో జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణ సిబ్బంది సహాయంతో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

జూదరుల అరెస్టు

బొండపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): వెదురువాడ గ్రామం వద్ద జూదం ఆడుతున్న 14మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. వారి వద్ద నుంచి లక్షా వెయ్యి రూపాయల నగదు, 9 సెల్‌ఫోన్లు, 14 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గరుగుబిల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు.వర్షాల వల్ల పలు రహదారులు బురదమయంగా మారడంతో ఈనెల ఒకటో తేదీన ఆంధ్రజ్యోతిలో బురదమయంగా గ్రామీణ రహదారులు శీర్షికన కథనం ప్రచురితమయ్యింది. దీంతో స్పందించిన అధికారులు రహదారులపై బురదను తొలగించి మెరుగుపరచడానికి చర్యలు చేపడుతున్నారు.మరుపెంట పంచాయతీతోపాటు సాంబన్నవలసలో 75 లోడ్లు రాతి బుగ్గిని వేసి యంత్రాలతో చదును చేయించారు. ఎంపీపీ ఉరిటి రామారావు, సర్పంచ్ నిర్మలతో పాటు మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు, కార్యదర్శి ఎం.భార్గవనాయుడులు రహదారులను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు.

బెల్టు తీసేదెప్పుడు?

(5వ పేజీ తరువాయి)

అదునుగా కొందరు బత్తిలిలో బెల్ట్ దుకాణాలు తెరిచారు. భామిని నుంచి మద్యం బాటిళ్లు తీసుకొచ్చి ఈ గ్రామంలో విక్రయిస్తున్నారు.

కేవలం బెల్ట్ దుకాణాలకే సరఫరా...

జిల్లాలోని ఒకమండలంలో ఐదుమద్యం దుకాణాలు ఉన్నాయి.అయితే అందులో ఒకదుకాణం నుంచి కేవలం బెల్ట్‌షాపులకే మద్యం సరఫరాఅవుతుంది. మిగిలిన నాలుగు దుకా ణాల నుంచి రిటైల్ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

తూతూ మంత్రంగా దాడులు..

కొన్ని ప్రాంతాల్లోని బెల్ట్ దుకాణాలపై ఎక్సైజ్ సిబ్బంది తూతూమంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారనే వ్యాఖ్యలు లేకపోలేదు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు మొత్తంగా 292 కేసులు నమోదు చేశారు. 292 మందిని అరెస్ట్ చేసి.. 508.2 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం

ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బెల్ట్‌షాపుల కట్టడికిచర్యలు తీసుకుంటాం. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభిస్తాం. బెల్ట్‌షాప్ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవు.

- రామచంద్రరావు, ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ శాఖ

ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

పాలకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె బుధవారం కూడా కొనసాగింది. అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు.అనంతరంకార్యాలయం ఎదుట మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చినా నేటికీ పరిష్కరించలేదని వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ఎస్.బాబూరావు,ఐ.వెంకటరమన, ఐ.రాజు, టి.ఈశ్వర్‌కుమార్, ఎస్.మహేష్, పి.సాయి, జి.నారాయణ పాల్గొన్నారు.

కాలువల నిర్మాణంలో లోపాలు సరిచేయాలి

పాలకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకళామందిర్ సచివాలయం పరిధిలోని కోమటిపేటలో గత ప్రభుత్వం నిర్మించిన మురుగు కాలువలుఏ లోపభూయిష్టంగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని టీడీపీ నాయకులు కోరారు.బుధవారంనగరపంచాయతీ కమిషనర్ రత్నంరాజుకు టీడీపీ నాయకులు గుమ్మడి సింహాద్రి, జన్నెల మురళీమోహన్ వినతిపత్రం అందించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అగ్నిమాపకశాఖాధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. వీరఘట్టంలోని యూనియన్ బ్యాంకులో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరిగినా వెంటనే సమాచారం తెలియజేయాలని కోరారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

సాలూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ ముఖీసూర్యనారాయణ తెలిపారు. బుధవారం సాలూరులోని వ్యవసాయ మార్కెటింగ్‌కమిటీ ప్రాంగణంలో రైతులకు డ్రోన్లపై అవగాహన కల్పించారు. రాయితీతో కందులు అందజేశారు.కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మింది సింహాచలం పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించాలి

కొమరాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఉలిపిరి బాలికల, పెదఖర్జేల ఆశ్రమ బాలురపాఠశాలలో ఎస్ఎఫ్ఐ బృందం సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు.

ఎమ్మెల్యేని కలిసిన ఆర్.నారాయణమూర్తి

పార్వతీపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి):పార్వతీపురంలోని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నివాసంలో ఆయన్ను సినీనటుడు, దర్శకులు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి బుధవారంకలిశారు. తాను రూపొందించిన యూనివర్శిటీ-పేపర్‌లీక్ సినిమా ఆగస్టు 22న రిలీజ్ కానుందని విజయవంతం అయ్యేందుకు సహకరించాలని నారాయణమూర్తి కోరారు.

ప్రజారోగ్యంపై చైతన్యపరచాలి

సీతానగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి):ఇళ్లల్లో నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. బుధవారం గుచ్చిమి,కె.సీతారాంపురంల్లో పక్షోత్సవాల్లో భాగంగాపలు పనులను డిప్యూటీ ఎంపీడీవో కె.కుమార్‌వర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగస్థలాల్లో మలవిసర్జన చేయడం వల్ల ప్రజల ఆరోగ్యానికి హానికరమని,ప్రజారోగ్యంపైకార్యదర్శులుచైతన్యపరచాలని కోరారు.

●వీరఘట్టం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమికెల్లలో బుధవారం పారిశుధ్య పక్షోత్సవాలు భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణపై గ్రామ సచివాలయ కార్యదర్శి రూపావతి ప్రజలకు అవగాహన కల్పించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

విప్‌పై చౌకబారు ఆరోపణలు మానుకోండి

జియ్యమ్మవలస, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరిపై మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి చౌకబారు ఆరోపణలు మానుకోవాలని టీడీపీ మండల నాయకులు కోరారు. బుధవారం చినమేరంగిలో టీడీపీ మండలాధ్యక్షుడు జోగి భుజంగరావు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ ఏడాదికాలంలో జగదీశ్వరిచేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. విప్‌పై నిరాధార ఆరోపణలు చేస్తే సహించుకోమని హెచ్చరించారు. డిప్యూటీ సీఎంగా గత ప్రభుత్వంలో మీరు ఏ అవినీతి, అక్రమాలు చేయకుండా వందల కోట్ల రూపాయలు బుట్టాయగూడెం నుంచి తీసుకువచ్చారా అని ప్రశ్నించారు.కార్యక్రమంలో అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్, వట్టిగెడ్డ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మూడడ్ల సత్యంనాయుడు, ఉపాధ్యక్షులు ఎం.ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు దాసరి రామారావు, మజ్జి చంద్రమౌళి, సర్పంచ్‌లు ఎం.దాలినాయుడు, బొంగు పరిశినాయుడు, మండల రమాశంకర్, క్లస్టర్ ఇన్‌చార్జి వై.రాంబాబు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

గుమ్మలక్ష్మీపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని పాలకొండ డీఎస్పీ రాంబాబు కోరారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలోని కస్తూరిబాగాంధీ విశ్వవిద్యాలయంలో సంకల్పం కార్యకమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ హరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలను వినియోగించుకోండి

సీతంపేట రూరల్,జూలై 16(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి4 సర్వేలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలను వినియోగించుకోవాలని ఎంపీడీవో బీబీ మిశ్రో సూచించారు. బుధవారం మండలంలోనిచినబగ్గ, దేవనాపురం, దారపాడు, గుమ్మడ, కొత్తగూడ పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు.

దబిడిలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో దబిడి గ్రామంలో విశ్రాంత డీఎంఅండ్‌హెచ్‌వో గుడివాడ ప్రభాకరరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వందమంది గిరిజనులకు పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో విశ్రాంత హెల్త్ ఆఫీసర్ బాబ్జీ ప్రసాద్ పాల్గొన్నారు.



సాలూరు: కూరుకూట్టిలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



కొమరాడ: మహిళలకు పథకాల గురించి వివరిస్తున్న కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



పార్వతీపురంటౌన్: నవిరి కాలనీలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

● జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు

ప్రజా సంక్షేమమే ధ్యేయమని టీడీపీ నాయకులు తెలిపారు. బుధవారం జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగుకార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదోనని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై వినతులను ప్రజల నుంచి తీసుకున్నారు.

సాలూరు: మండలంలో కూరుకూట్టిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ 18 ఏళ్ల పాటు నియోజకవర్గంలో అధికారం చెలాయించిన నాయకులు ఏం అభివృద్ధి చేశారో చొక్కా పట్టుకొని నిలదీయాలన్నారు. మండలంలో సుమారు 20 కోట్లతో రహదారుల నిర్మించనున్నట్లు తెలిపారు.సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గెలిపించి బహుమతిగా ఇస్తే అభివృద్ధి సంక్షేమం బహుమతిగా ఇస్తానని తెలిపారు.మండలానికి వంద గోకులాలు మంజురయ్యాయని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో బినామి నాయకులకు అవకాశం ఉండదని,గిరిజన పంచాయతీల్లో గిరిజనులే నాయకులని,గిరిజనులకు సేవ చేయ్యాలే కానీ దందాలు చేస్తే సహించేది లేదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.



పాలకొండ: సింగుపురంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

● జిల్లాలోని పలు దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. బుధవారం జిల్లాలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

● గరుగుబిల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎరువులు కృత్రిమ కొరత సృష్టించవద్దని విజిలెన్స్ సీఐ రమణయ్య కోరారు. సంతోషపురం పంచాయతీఖడ్గవలస పరిధిలోని శ్రీరామాంజనేయ ట్రేడర్స్‌కు సంబంధించి ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, అమ్మకం చేసిన రసీదులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. నిబంధనల మేరకు రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని కోరారు.అధిక ధరలకు విక్రయిస్తే రైతులు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన ఎరువులకు రసీదులు పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు చంద్రరావు, టెక్నికల్ ఏవో రవీంద్ర, ఏవో జ్యోత్స్న, ఏఈవో షరీఫ్ పాల్గొన్నారు.

●జియ్యమ్మవలస, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమేరంగిలో అన్నపూర్ణ ఏజెన్సీ ఎరువుల దుకాణంలో వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలన, ఎరువుల నిల్వలు పరిశీలించారు. స్టాక్ బోర్డు వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుకాణంలో సీఎంఎస్ 12.5 మెట్రిక్ టన్నుల ఎరువులు స్టాక్ తదుపరి ఉత్తర్వులు అందే వరకు క్రయించవద్దని అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ పి.రామయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రశేఖరరావు, ఏవో విజయభారతి ఉన్నారు.



గరుగుబిల్లి: ఖడ్గవలసలో ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ సీఐ రమణయ్య

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవాలి

పాలకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ఉత్తమమైన మార్గమని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షురాలు సీహెచ్ హరిప్రియ తెలిపారు. బుధవారం పాలకొండలో జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం-దేశం కోసం కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు, కోర్టుసిబ్బంది, పోలీసులు, పారాలీగల్ వలంటీర్లు కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం కార్య క్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కక్షిదారులకు మేలు చేకూరుతుందని, మధ్యవర్తిత్వంపైనే ప్రతి ఒక్క పౌరుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ చం ద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శామ్యూల్ పాల్గొన్నారు.

●బెలగాం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకోవడమే రాజ మార్గమని సీనియర్ న్యాయవ్యాది, లోక్ అదాలత్ సభ్యుడు జోగారావు తెలిపారు. బుధవారం పార్వతీపురంలో మధ్యవర్తిత్వం-దేశం కోసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీపురం మండల న్యాయ సేవా కమిటి న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, జి.వెంకటరావు పాల్గొన్నారు.



బెలగాం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

●కురుపాం, జూలై16 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం-దేశం కోసం అవగాహన కార్యక్రమం భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు గొటారి వెంకటరావు, పారా లీగల్ వలంటీర్ అందవరపు కోటేశ్వరరావు, మండల న్యాయ సేవ సంస్థ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువలో భారీ వర్షం

మక్కువ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మక్కువ తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఒక్కసారిగా కురిసిన వర్షం వల్ల ఉపశమనం కలిగింది. ఖరీఫ్‌లో వేసిన నారు మడులకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. భారీ వర్షం వల్ల మక్కువ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి ప్రవహించడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

●సాలూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏజెన్సీలోని సాలూరు, మామిడిపల్లి, పాచిపెంట తదితర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోత, ఎండవేడిమితో ఇబ్బందిపడిన ఏజెన్సీ వాసులు వర్షంతో సేదదీరారు. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్మి వర్షం కురవడంతో ఊరట లభించింది. వర్షం నారుమడులు, మొక్కజొన్న,పత్తిపంటకు ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.



మక్కువ: ప్రధానరహదారిపై వర్షం నీరు ప్రవహిస్తున్న దృశ్యం

అశోక్‌ను కలిసిన నాయకులు

కురుపాం, జూలై 16(ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతి రాజును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, కుటుంబ సభ్యులు విజయనగరం కోటలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, ధీరజ్ చంద్రదేవ్ పాల్గొన్నారు.

కళాశాలలో సీట్లు పెంపునకు ఉత్తర్వులు

సీతంపేట రూరల్,జూలై 16(ఆంధ్రజ్యోతి):సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఏపీఆర్ జూనియర్ బాలికల కళాశాలలో సీట్లు పెంచుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడ ప్రవేశాలకు ఈ ఏడాది సీట్ల కొరత నేపథ్యంలో ఐటీడీఏలో సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో వినతులు వెల్లువెత్తాయి. దీంతో ఐటీడీఏ అధికారులు స్పందించి బాలికల కళాశాలలో సీట్లు పెంచాలని ప్రభుత్వానికి నివేదించారు. ఈనేపథ్యంలో స్థానిక ఏపీఆర్ బాలికల జూనియర్ కళాశాలలో 30 సీట్లు అదనంగా పెంచుతు బుధవారం గురుకుల సొసైటీ డైరెక్టర్ నుంచి డీడీ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. ఇక్కడఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ,హెచ్ఈసీగ్రూప్‌లో పదేసి సీట్లు చొప్పున పెంచుతూ ఆదేశాలు వచ్చినట్లు డీడీ అన్నాదొర చెప్పారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

పార్వతీపురం రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన్‌రావు సూచించారు. కృష్ణపల్లిలో టీకా కార్య క్రమాన్ని బుధవారం తనిఖీ చేశారు.

గుండంలోనే గజరాజుల తిష్ఠ

సీతంపేట రూరల్,జూలై 16 (ఆంధ్రజ్యోతి): గుండం గ్రామ సమీపంలోనే ఏనుగులు తిష్ఠ వేశాయి. కొద్దిరోజులుగా రంగం వలస,గుండం గ్రామాల పరిసరాల్లో ఏనుగులు సంచరిస్తుండడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. కొండపోడు పనులకు వెళ్లలేకపోతున్నట్లు వాపోతున్నారు.

ఆర్థిక లావాదేవీలు నమోదు చేయాలి

పాచిపెంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గల సంఘాలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు దస్త్రాలతో పక్కాగా నమోదు చేయాలని వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు తెలిపారు. బుధవారం పాచిపెంటలో గ్రామ సంఘాల నగదు పుస్తకం, తీర్మానాలు, రశీదులు, ఓచర్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్‌సీ కె.సత్యానారాయణ పాల్గొన్నారు.